# ప్రజాకోర్టు

వారంరోజుల కిందట గెంజిపెట్టి, యిస్త్రీ చేయబడ్డ ఖాకీ చొక్కా, ఖాకీనిక్కరూ జెండా కొయ్యలా సన్నగా పొడుగ్గా వున్న జగ్గారావు ఒంటి మీద ఎద్దుకి ఏనుగు తోలు తొడిగినట్లు ఒదులొదులుగా వున్నాయి. ఎండకి సెంవట తేలి, తడిసి, అక్కడక్కడా తెల్లగా ఉప్పుదేలి గబ్బు గొడుతున్నాయి. నెత్తిమీది ఎర్రటోపీ కప్పిన జుత్తులోంచి చెమటలు ఊరి మొహమ్మీదకి కారుతోంటే జగ్గారావు మొహం తడిసిన పెద్ద నక్క మొహంలా వుంది!

గోర్జిలోంచి సైకిల్ తొక్కుకుంటూ, అక్కడక్కడా వీలుకానిచోట సైకిల్ దిగి నడుస్తూ ఆ ముదరెండలో, సుమారు ఉదయం పదకొండు గంటల వేళ.... 'గాయితాడ' వెల్తున్నాడు!

గోర్జితోవ అక్కడ మలుపుతిరిగింది. మలుపు తిరిగేదాక ఎదురొచ్చే యేదీ కన్పించనంత దట్టంగా గోర్జి కిరువైపులా డొంకలు! గోర్జిలో మట్టి పశువుల కాలి గిట్టలకీ నాటుబళ్ళకీ నలిగి, ధూళయి తుప్పా డొంకా నిండింది. తుప్పల ఆకులు స్వతహాగా వుండాల్సిన పచ్చదనంతోగాక గోధుమరంగు ధూళి పడి వికారంగా వున్నాయి. ఎండతో గాలి దుమ్ము వాసనేస్తోంది.

మలుపు తిరిగిన జవానుకి ఎదురైపోయాడు అరిక పగడాలు! ఎదురైపోయిన పగడాలు చేతిలో రెండు ఎర్ర పుంజులు రెక్కలాడిస్తూ కన్పించాయి!

పగడాలూ, పగడాలు చేతిలో ఎర్ర పుంజులూ ఒక్కసారిగా అదిరి పడ్డాయి. సైకిల్ మీది జవాన్ని చూసి!— ప్రాణం మీది కొచ్చిన పెద్ద నక్కను చూసినట్లు పుంజులురెక్కలు గొట్టుకున్నాయి. పగడాలు గుండెలు కొట్టుకున్నాయి.

జవాను సైకిలు గంట కొట్టాడు! సైకిలాపాడు! పగడాల్ని ఆపి,

"యేట్రోరె కొండోడా! మంచి పెద్దొరస పుంజుల్లాగున్నాయి. యేవిరా!" అని చేతులు చాపాడు కోడిపుంజుల కోసం!

పోలీసోడి పాలబడితే మరి డబ్బులురావు అని బెంగపడినపగడాలు గునుస్తూ—

"నావి కావు బావ్. మొన్న పల్లంకాంచి మానేస్త(వొచ్చి, డబ్బ లిచ్చి కొనుక్కున్నాడు. యీ పొద్దు తెమ్మంతే, వొట్టుకెల్తన్నాను" అన్నాడు.

"పల్లపోడె నేస్తమేటి? పోలీసోడు కాడేటిరా? అదికాదూ, సూత్తా నియ్యెరనీసరికి ఏట్రలగ సుట్టుకుంతావు? ఇయ్యేస్..." అని లాక్కొని కోడి పుంజులు రెండింటినీ రెక్కలెత్తి బరువు ఆనిక చూసుకొని, గుద్దమట్ట గారకాయ తడిమి, బాగున్నాయని సంతృప్తి చెంది, కష్టమొట్టినే పోదు అనుకొని, ఈ యెండల పెవప్లెక్కి సైకిలు తొక్కినందుకు ఫలితం దక్కింది అని భావించి, సొండోడి సారా-కోడికూరా తోటి మజానిగూడా తల్చుకొని పుంజులు రెండింటినీ సైకిలు హేండిలుకి తాడు తోటి కట్టేసాడు. సైకిలు తీసి, పయనమయ్యాడు మళ్లీ....గొయితాడ!

"బాబ్బాబు! జవాను బాబు, వొదిలీవా? నావిగావా పుంజులు. మా పల్లం నేస్త మొల్ల కోడు! పుంజులొట్టికెళ్ళపోతే—మల్ల అతగాని మొకం సూడలేను" అని బతిమాలాడు పగడాలు.

"నేస్తం మొకం సూడకపోతే నష్టమేటిలేదు. కొండనమ్మికే నాకోపమొత్తే మరి నువ్వూ నీ పెళ్ళం మొకం సూడవ్, జాగర్త ! పోనీగదా అని పుంజులుతోటి వొదిలేత్తన్నాను. దొరికినావురా నక్సలైటు నాకొడకా ! అని లాకప్పులెట్టి ఎముకలిరిసీగల్ను !" అని లాఠీ పగడాలు మొహంమ్మీదకి ఊపి, అదిరించి—

"అంచేతెల్లు. ఎర్రా! అమాయకపోడి లాగున్నావు. ఏఊరేట్రా?" అనడిగాడు.

"గొయితాడ బావ్..."

"మరింకేమి. నేనూ అక్కడికే వొత్తన్నాను. సొంఠోడున్నాడురా ?

"ఉన్నాడు బావ్.— నా కోళ్ళిచ్చీవా ?" సైకిలు ఎదురుగా వెల్లి, మళ్ళీ బ్రతిమాలుతూ అడిగాడు.

సైకిలుని ముందుకు తోసి గద్దించుతూ—

"యేఁవిరింకొదలవు ? యెముడెనకాల సావిత్రి నాగ యెంటబడ్డావంతే మళ్ళ జివ్వలు యిరిగిపోగలవు." అని మరోసారి సైకిలు తోటి పగడాలుని తోస్సి, హేండిలుకి కట్టిన కోళ్ళని చేత్తో తడిమి, భద్రమే అని తేల్చుకుని, ఈల వేసుకుంటూ సైకిలెక్కి గొయితాడ తోవబట్టాడు జగ్గారావు జవాను !

తన దారిద్ర్యాన్నీ, జవాను దౌర్జన్యాన్నీ కలిపి తిట్టుకుంటూ, నేస్తం యేటంతాడో అని బెదురుతూ, పల్లం వెళ్ళలేక పగడాలు ఇంటివైపే తిరుగు ముఖం పట్టాడు.

తిన్నగా వెల్లి గొయితాడ ఊరి మధ్యలోనున్న సొండోడి ఇంటిముందు సైకిలాపి, స్టేండు వేసాడు జవాను జగ్గారావు !

మందలోకి తిన్నగా వొచ్చీసిన ఎర్రజిందవని చూసిన మేకల్లా

చెల్లా చెదురయ్యారు.... అప్పటివరకూ సొండోడి అరుగులమీద కూర్చున్న కొంతమంది గిరిజన్లు.

కదల్లేక దొరికిపోయిన చూడిమేక పీకపట్టుకున్న యెర్రజిందవలాగ సొండోడింట్లోని యిప్పసారా గూన పట్టుకున్నాడు జవాను.

సొండోడు ఇంట్లోలేడు. సొండోడి పెళ్ళాం కాంతమ్ముంది. కాంతమ్మకిదేమీ కొత్తకాదు. గనుక గాభరా పడలేదు. భయపడనూలేదు. గూన పక్కనే వున్న గ్లాసొకటి తీసి, యిప్పసారా గూనలో ముంచి, ఆ గ్లాసు జవాను కందిచ్చింది.

"సొట్టగ్లాసు సారాతోటి సరిపెట్టేద్దమనుకుంతన్నావేటే సొండిదానా? నీనెందుకొచ్చేనో యేటో తెల్సా ?" అని గదుముతూ గ్లాసందుకున్నాడు జవాను.

"పోలేరమ్మ తల్లికీ పోలీసోడికీ అడ్డేటి ? నువ్వడిగిందెప్పుడు కాదన్నాం(వు ?" అని చనువుగానే జవాబిచ్చింది కాంతమ్మ.

కాంతమ్మ చనువు యెందుకో జగ్గారావుని చిరాకు పర్చింది. ఆ చిరాకుతోనే—

"ఇరిడి ముక్క సేవబట్టేసినట్టుగ నీ వొంటికి పొత్తరం బట్టేసిందే..." అన్నాడు.

ఇంతలో సొండోడొచ్చాడు. "జవాను జెగ్గారావా ? దండాలు" అని పలకరించి, భార్యతో—

"జెవాను బాబుకి కుర్చీయేసి కూకోమన్లేకపోనావా ?" అనడిగాడు.

మూలనున్న కుర్చీ ధూలి దులిపి తీసుకొచ్చి వేస్తూ—

"ఒచ్చినకాంచి గయ్యి గం(య్ మని కేకలేసి, తెయితెయ్యిమని గెంతులేత్తండుగానేటి తాల్తండా ? నిలుత్తండా ? నీను కూకోండి బావో ! అని కుర్సీ యెయ్యడాంకి !" అని జెవాన్ని దెప్పుతూ జవాబిచ్చింది కాంతమ్మ.

కాంతమ్మ మాటల్లో దెప్పిపొడుపుని కప్పిసుకుంటూ—

"సర్లేగానీ, అదిగా సైకిల్ హేండిల్‌కి ఎర్రపుంజులు రొండుంతాయి. ఆటిని తెచ్చి నూకలెయ్యిమీ. తిరిగెల్లినపుడు ఒట్టికెల్తాను!" అని పురమాయించాడు.

"ఘనమయిన పుంజులు... యెక్కడ కొన్నావోగానీ బాగున్నాయి." అంది కాంతమ్మ కోళ్ళను తెచ్చి.

"జగ్గారావు జవాను జేబుడబ్బులెట్టి పిండొడాలే కొన్డు. పుంజులు కొంతాడా?" అన్నాడు హాస్యంగా సొందోడు.

"నోర్ముయ్యెర సొండినాకొడకా! కాలం మారిపోనాదిరా! ఒట్టి పున్నెంకి వొస ముక్క దొరకవీరోజుల్ల! లేపోతే, నెల మామూళ్ళికి సొందోడింటికి రావల్సివొత్తాదా?" అని తిరిగి దెబ్బకొట్టాడు జవాను.

"ఔనుగానీ, కవురెడితే కాకితోని పంపినా! నువ్వే రావాలా! రాక, రాక తిన్నగ పులి వొండలోకి ఎలిపోవచ్చినావు?" అన్నాడు సొండోడు.

"ఓరేత్రో! యేటి సొండోడా? పులి వొండంటన్నావు నీ ఇంటి కొస్తే! గిరగుందేటిరా?" పోలీసు గసిరాడు.

"అదిగాదు బావ్! ఇదిగీ వొలసలన్నీ సంగమయిపోయినాయి. ఈ యేరియా ఓలు మొత్తంల సంగమే పెబుత్వం. మేస్టుర్రిగోరూ, సంగపోల్లూ యేటిజెప్తే అదే యేదం! నీకు తెల్సదేటి? దగ్గిట, దగ్గిట మూడొంద లొలసల్ల సంగానిదే రాజ్జెం! బుగతలు భూంవులొదులుకొని, సావుకార్లు అప్పూ సప్పులొదులుకొని పట్నాలు పట్టీసినారు. కర్నం, నాయుడ్లు కలాలు మూస్సినారు. పారిస్టోలు అడివిని మర్సిపోనారు. పనికాడ నుండి పంటదాక, తిండి కాడ్నిండి తగువులా తంటాలు దాకా అన్నిటి కాడ— ఆ సంగపోళ్ళే! ఇప్పుడికక్కడ నీ గవిర్మెంటూ లేదు. నీ పోలీస్తనమూ

సెల్లదు. ఇదిగిదీ చంగతి—" అని సొండోడు అప్పటి పరిస్థితిని క్లుప్తంగా వివరించాడు.

సొండోడి మాటల్తో జగ్గారావులో భయం కల్గింది. సంగం గురించీ, మేస్టారి గురించీ విన్నాడు. గానీ తమ స్టేషన్‌కి కనుచూపు దూరానున్న 'గొయితాడ' ల గూడా సంగమోల్ల బలం వుంటాదనుకోలేదు. అయినా యిపుడు తొందరపడాల ! ఈ సొండోడ్ని స్టేషన్‌కి పట్టుకెల్తే, సంగం స్థావరాలేమేనా తెలియొచ్చు అని ఆలోచించి, గభాలున కుర్చీలోంచి లేచి, టోపీ తలకు తగిలించి, లాఠీ చంకలో పెట్టి, కాంతమ్మనుండి కోడి పుంజుల్ని అందుకొని సైకిలు వద్దకెల్లి, పుంజుల్ని హేండిలుకి కడ్తూ...

"బానారే సొండోడా ! నీకు సైకిలున్నాది గదరా ? అలాగ స్టేషన్ దాక తోడురమ్మిరా...." అని పిల్చాడు.

"ఓలమ్మో ! పోలీసోడి తోటెల్తే యింకేటున్నాదా ? సంగపోలి కెవులికేనా దసులయితే మా పనయిపోద్ది. వొద్దునాయినో." అంది కాంతమ్మ.

"ఓసేటే నీ గోస ? గవర్మెంటోడి మాటినకపోతే, గంగల కలిసిపోద్దే నీ యాపారం." అన్నాడు జవాను.

"యేపారం యేటిల కలిత్తే కల్నీగానీ, బతుకులు బుగ్గయిపోతాయి నాయినో ! సంగపోలికి యే పెమాదమూ తలపెట్టమని మాటిచ్చి, ఆలకను మానం రాకండా బతుకొత్తన్నాము. నే పోతే మీమూ పట్నాలు బట్టీ వాల్సింది ! పట్నమెల్తే పాసిగియ్యడంకి పనికిరాము. ఇదిగీ యాపారం సేసి నిన్నూ.... నిన్నూ- బెంచాము తప్పా యేటి మిగలేసుకోలేదు. అందికనీ, వొదిలీబావ్. మమ్మల్నొదిలీసి, నీ మామూలు నువ్వొట్టి కెలిపో !" అని జవానుతో చెప్పి, మొగుడితో—

"అతగాని మామూల్లిచ్చి గూడదేటి ?" అని కేకేసింది.

"సొండి నంజి కూతరా ! పిండొడానికి సెల్లనిదానివి, యీ

కొండల్ల యాపారం జేస్సి భూఁవులూ, పుట్టలూ గడించీసినావు. ఎవుడ్నీ నువ్వో ఒట్టి పున్నేనికి పెంచీసినావు ? ఎంత కళ్ల కావరమే నీకు ? సూడు, సూడైతే, కాకిబట్టలోడి దెబ్బ కాస్కో. కాస్కోయే !" అని లాఠీఎత్తి, ఇంట్లోకెల్లి యిప్పసారా గూన మీద కొట్టాడు.

గూన పగిలిపోయింది. సారా నేల పాలయింది. ఇల్లంతా విప్ప మొగ్గా, అమ్మోనియా పులిసిన ఘాటు వాసన !

అట్నుండొచ్చి, లాఠీతో సొండోడ్ని తోస్తూ—

"పద, పదరా మరియాదగ...." అని సైకిల్ వద్దకు తీసుకెల్లాడు.

"ఓలమ్మో ! ఓర్నాయినో ! ఇదేటి గోరం ? బావో, జమాను బావో.... అతగాన్నొట్టి కెల్లొద్దు." అని యేడుస్తూ సైకిల్‌కి అడ్డమొచ్చింది కాంతమ్మ.

సైకిల్ ముందు చక్రంతో కాంతమ్మని బలంగా పొడిచి తోస్సాడు. కాంతమ్మ వెనకమారుగా కూలబడింది ! లాఠీతో సొండోడి రెక్కల మధ్య పొడిచి "పదేస్" అని, కదలబోయాడు జగ్గారావు జవాను.

ఇంతలో గొయితాడ గ్రామరక్షక దళం వచ్చింది. దళకమాండరు సుక్కు చేతిలో గండ్ర గొడ్డలుంది. మిగతా దళ సభ్యులందరి దగ్గరా తలా ఓ ఆయుధ ముంది. జగ్గారావు జవాను సొండోడింటి ముందు సైకిలాపి, స్టేండు వేసినపుడు అక్కడి నుండి బెదిరి, పారిపోయిన గిరిజన్లలో కొంతమంది దళ స్థావరానికి కబురందించారు.

కోడిపుంజులు పోగొట్టుకున్న పగడాలు గూడా, దళం వెనుక గుమి గూడిన జనంలో వున్నాడు !

"యేయ్, పోలీసోడా ! నిలబడక్కడ." సుక్కు కేకేసాడు.

కేక వినబడింది. కేకవచ్చిన దిక్కు చూసాడు పోలీసు.

గోచీతప్ప ఒంటి మీద యేమీలేని మామూలు గిరిజనుడే !

"యేరా, కొండోడా ? నువ్వొ వొత్తావేటి స్టేషన్‌కి" అడిగాడు పోలీసు.

"ఛేసిన్‌కి గాదుగానీ, నీ తాతల్దగ్గిటికెలిపోగలవు .... మల్లి...." అని గండ్ర గొడ్డలెత్తి దగ్గరకు వస్తోన్నాడు సుక్క.

జగ్గారావు నిలబడి పోయాడు. సుక్క చేతిలో ఎత్తి పట్టుకున్న గండ్ర గొడ్డలీ, వెనకాల గల దళం చేతుల్లోని ఆయుధాలూ చూసేసరికి జవాను కాళ్లూ చేతులూ రక్తమాంసాలు లేని కర్రలయి పోయాయి! సైకిల్ పడిపోయింది. జవానూ కొయ్యబారిపోయి, పడబోతుంటే దళ సభ్యుడొకాయన వచ్చి పట్టుకున్నాడు. అంతా గలిపి జవాన్ని గ్రామకమిటీ ఆఫీసుకి తీసుకెల్లారు!

స్పృహదప్పిన జవానుకి శుశ్రూషలు జేసి, స్పృహలోకి తెచ్చారు. తెలివొచ్చాక లేచి, కూర్చొని చుట్టూ చూసాడు జగ్గారావు జవాను! చుట్టూ గోచిగుడ్డల గిరిజనులు!

కాకిబట్టల అలికిడికి అదిరిపడే ఆ గిరిజనులే?

తనవైపే చూస్తున్న ఆ జనం కళ్లల్లోకి చూసే ధైర్యంలేని జగ్గారావు తలదించుకున్నాడు!

ఎదురుగా కూర్చున్న గ్రామ కమిటీ బాధ్యుడు—

"నిన్ను మా గ్రామరక్షక దళం అరెస్టు జేసింది. నీ మీద విచారణ జరపడానికి ప్రజాకోర్టు యేర్పాటు చేయమని మా కేంద్ర స్థానానికి కబురు పెడతాము. వారు కోర్టు యేర్పాటు చేసేదాక నువ్వు మా ఖైదీవి.

మేము ఖైదీలను మీలాగా బాధించము. గౌరవిస్తాము. నీకు అన్ని సౌకర్యాలూ మాకున్న మేరలోనే గ్రామ కమిటీ యేర్పాటు చేస్తుంది. నీకు సంకెళ్లుండవు. లాకప్పుండదు. సవాలక్ష ఆంక్షలుండవు.

కానీ పారిపోవటానికో, మరేదన్నా కుతంత్రానికో పూనుకున్నావో అడివి, అడివంతా నిన్ను చుట్టు ముడతాది. మా దళం గొడ్డళ్లకి నీ శరీరం బలయిపోద్ది." అని అన్నీవివరించి, హెచ్చరించాడు.

జగ్గారావుకి తన ప్రాణం పోయిందనీ, ఇదంతా మరో లోకంలో

జరుగుతోందనీ అన్పించిందో క్షణం ! మళ్లీ మరుక్షణం కళ్లు గట్టిగా నులుముకొని, నమ్మకానికై కాకీగుడ్డలు తడుముకొని; తన నెంబరు గుర్తుకుతెచ్చుకుని, దాన్నీ తడుముకునీ - లేదు, చనిపోలేదు ! అనే నిర్ణయానికొచ్చాడు.

ఆ నిర్ధారణకు రాగానే, మరోసారి గ్రామకమిటీ బాధ్యుని వివరణా హెచ్చరికా స్మరణలోకొచ్చాయి.

అమ్మనాయిన ! గొడ్డలివెత్తీ ఎత్తగానే - చచ్చాను. అయిపోయింది నాపని అనుకున్నాను. సొండోడు మాటల్లో పెట్టేసి యెంత దెబ్బ తీస్తాడు అనుకున్నాను. రక్షించారు. చంపీలేదు—

అని మనసులో అనుకుంటూ, చేతులెత్తి దేవుడికో, ఎదురుగావున్న గ్రామకమిటీ బాధ్యుడికో...అసంకల్పితంగా దండంపెట్టాడు !

*　　*　　*

రెండు రోజులు గ్రామకమిటీ నిర్బంధంలో వున్న జగ్గారావును కేంద్రస్థానం వారు యేర్పాటుచేసిన ప్రజాకోర్టుకు మూడోరోజు తీసుకు వెళ్లింది గ్రామకమిటీ !

ఈ రెండు రోజులూ, ఓ కొత్తలోకాన్ని చూసాడు జగ్గారావు ! గిరిజనులలోని ఐకమత్యమూ, సంఘం నేర్పిన క్రమశిక్షణా వారిలో అడుగడుగునా కన్పిస్తోంది. రాత్రి పాఠశాలలలో అక్షరాలేగాక, రాజకీయాలు గూడా పట్టుదలగా నేర్చుకుంటున్నారు గిరిజనులు ! పిల్లల్లో గూడాగొప్ప మార్పు కన్పిస్తోంది. ఏమీ తెలీనోళ్లు, గొడ్డో అంటే బెడ్డందుకొనేరకం మనుషులు ఎంతగా మారిపోయారు ? ఎంత చిత్రం ! పోలీసోడి మీద ఎంత కక్ష, కావేశం వున్నా యీ రెండు రోజుల నిర్బంధంలో యే మాత్రం అగౌరవపరచని యీ గిరిజన్లకీ; నిర్బంధంలో వున్న వారిని...అన్ని చట్టాల్నీ అతిక్రమించి, అతి దారుణంగా హింసించే తమ పోలీసుజాతికీ యెంత భేదం ! — ఇలా విస్మయుంచెందాడు జగ్గారావు !

×　　×　　×

రాళ్లూ, రప్పలూదాటి, ముళ్ల బాటల్లోంచి, కొండలెక్కి-దిగి, తిన్నగా ప్రజాకోర్టు స్థలానికి వచ్చాక, జగ్గారావు కళ్లకు కట్టిన గంతలు విప్పారు. రెండు చేతుల్తో కళ్లు నులుముకొని, చుట్టూ చూసాడు జగ్గారావు !

విశాలమయిన మెరకభూమి ప్రజాకోర్టు ! చుట్టూ దట్టమైన తుప్పా డొంకలు ! డొంకల్లో ఆయుధాలతో మాటుగాసిన గెరిల్లాలు !

చుట్టు ప్రక్కల గ్రామాల్లో ప్రచారం చేయటం వలన దాదాపు నాలుగైదు వందల మంది దాకా ఆడా మగా చేరారు ప్రజాకోర్టుకి. ప్రజలే న్యాయవాదులు ! న్యాయమూర్తులు ! ప్రజాభిప్రాయమే న్యాయశాస్త్రం !

అందరూ కూర్చున్నాక, ముగ్గురితో కూడిన ఒక సాంస్కృతిక బృందం వారు– "ఓ అరుణపతాకమా ! చేకొనుమా రెడ్ శాల్యూట్ !" పాట ఉత్తేజంగా పాడారు.

పాట పూర్తయ్యాక, 'భారత రైతాంగ సాయుధపోరాటం వర్ధిల్లాలి!' 'విప్లవం వర్ధిల్లాలి !', ' అమర వీరులకు జోహార్ !' - వంటి నినాదాలు ఆ కొండల్లో మార్మోగాయి. సాంస్కృతిక బృందం జనంలోకి వచ్చి కూర్చొంది.

జనంలోంచే, ఒక కామ్రేడ్ లేచి ముందుకువచ్చి, నిల్చొని - గొయితాడ గ్రామకమిటీ అరెస్టు చేసిన - దోపిడీ పాలక వర్గాల పోలీసు, జగ్గారావుపై విచారణ జరపడానికి యీ ప్రజాకోర్టు యేర్పాటు చేసాం. ఈ ప్రజాకోర్టును నిర్వహించవలసిందిగా, మన ప్రియతమ కామ్రేడ్ 'మేస్టారు'ని కోర్తున్నాను" అని మేస్టారుని కోర్టు నిర్వహణకు ఆహ్వానించాడు.

జనం చప్పట్లు కొట్టి ఆమోదం తెల్పారు. మేస్టారు లేచి జనం ముందుకొచ్చారు. కోర్టు నిశ్శబ్దమైంది. కోర్టు వేదికగా భావించే స్థలం ప్రక్కగా జగ్గారావు నిల్చున్నాడు.

"ప్రియతమ ప్రజలారా ! కామ్రేడ్స్ ! ! ఈనాడు మనం గొప్ప కర్తవ్యాన్ని నిర్వహించాల్సిన బాధ్యతలో వున్నాము. కుళ్లిపోయిన ఈ దోపిడీ వ్యవస్థను కూలదోసి; నూతన వ్యవస్థ నిర్మించాల్సిన బాధ్యతలో వున్నాము. నక్సల్బరీ బాటలో సాయుధులైన మనం యీ దేశాన్నిమార్చాల! ఈ దేశంలోని కన్నీళ్లను తుడవాల ! కష్టాలను కడగాల ! అక్రమాలనూ, అన్యాయాలనూ అంతం జేయాల ! ప్రజలకోసం నూతన రాజ్యం; దోపిడీ పీడనాలేని శ్రమ జీవుల రాజ్యం నెలకొల్పాల !

ఈ కర్తవ్య నిర్వహణలో, మన పార్టీ నాయకత్వంలో అనేక కష్ట నష్టాలకూ, త్యాగాలకూ వెనుదీయని ఎందరో కామ్రేడ్స్ మన జెండాను మరింత ఎరుపెక్కించారు. ఈ ఎర్రజెండా ఇక్కడి కొండ కొండనీ కదిలించింది !

ఈ కదలిక మీద ఇటు ఇక్కడి భూస్వాములూ, షావుకార్లూ; అటు ప్రభుత్వమూ....పోలీసు బలగాలతో పెద్ద యెత్తున దాడి చేస్తున్నారు. మన గూడేల్ని తగలబెట్టటం నుంచి, మనల్ని అరెస్టుజేసి కొట్టి చంపటం దాకా అనేక అక్రమాలు చేస్తున్నారు. తప్పుడు కేసుల్తో తిప్పలు పెడ్తున్నారు. వారి కోర్టుల్లో మన మీద నడుస్తున్న కేసులన్నీ అబద్ధపు కేసులే ! వారి కోర్టు నిర్వహణతీరే అది !

కానీ, మనం అన్నిటిలోనూ మార్పులు తేవాల ! ఎవర్నయినాసరే, మనం మనరీతిలో ప్రజాకోర్టులో విచారించాల ! అందుకనే, ఇలా ప్రజాకోర్టు యేర్పాటు చేసాం.

ఇప్పుడు గొయితాడ గ్రామకమిటీ వార్ని పోలీసు మీద తాము సమర్పించిన ఆరోపణల పత్రాన్ని కోర్టు ముందు చదివి వినిపించమని కోర్తున్నాను...." అని షేస్టారు సుదీర్ఘంగా తమ లక్ష్యాల వెలుగులో తమ బాటను వివరిస్తూ, కోర్టు నిర్వహణ ప్రారంభించారు !

జగ్గారావు జవాను జీవితంలో ఎరుగని; ఆలోచన కందని ఆ కోర్టు నిర్వహణ తీరు చూసి ఎంతో సంచలించిపోయాడు.

మేస్టారు ఆర్డరు దాక మాత్రమే గొయితాడవాళ్లు తనను వుంచారనీ ఆయన ఆర్డరయ్యాక, అందరిముందూ తన తల నరికేసి, ఆ తలని తీసికెల్లి పల్లం తోవలోని చెట్టుక్కట్టేసి, దాని మీద హెచ్చరిక రాసినచీటీ వుంచుతారనీ అనుకున్నాడు ! యేమంటే, ఇలాంటి కథలే తను విన్నాడు. ఆ విన్న కథల వల్ల, తన కథ గూడా అలాగే ముగుస్తుందని అనుకున్నాడు గానీ, మేస్టారు ఉపన్యాసంలో వివరించిన లక్ష్యమూ, అందుకోసం వారూ వారి నాయకత్వంలో ప్రజలూ అనుసరిస్తున్న బాట, వారి త్యాగశీలతా, జవానులోని అంతరాత్మని ఖాకీ కరకుపొరలను చీల్చి బయటకు లాగాయి! గొయితాడ గ్రామ కమిటీ పోలీసుపై తమ ఆరోపణ పత్రం చదివారు. పగడాలు దగ్గర గుంజుకున్న కోడిపుంజుల గూర్చి సొండోడి మీద చేసిన దౌర్జన్యం గూర్చి మాత్రమే గాక; గతంలో జగ్గారావూ, వారి స్టేషన్ పోలీసులూ చేసిన అక్రమాలు అనేకం అందులో ఆరోపింప బడ్డాయి.

జగ్గారావుకి ఆ ఆరోపణ పత్రంలో అంశాలకంటే గూడా ఇంకా నేరస్తంగా తన ఉద్యోగం కన్పించింది.

నేరభావంతో తలదించుకున్నాడు.

నేరారోపణ జరిగాక, మేస్టారు లేచి జవానుని ప్రశ్నించసాగారు.

"నీపేరు....?"

చెప్పేడు.

"యే స్టేషన్ పోలీసువి ?"

చెప్పేడు

"యెందుకొచ్చావు గొయితాడ ?"

"................"

"నీకు పిల్లలున్నారా ?"

"ఇద్దరు కొడుకులూ, ఒక కూతురూ వున్నారు"

"ఆ సొమ్ము పుట్టా యేమేనా వుందా ? నీమీద వచ్చిన ఆరోపణలు విన్నావుకదా నువ్వు చెప్పదలచుకున్నది యేమన్నావుంటే, చెప్పుకోవచ్చు...."

గొంతులో అనేకానేక భావోద్వేగాలు! మనసులో సంఘర్షణ! ఏమి చెప్పాలో, యెలా చెప్పాలో, తనలోని అంతస్సంఘర్షణని ఎలావిప్పించాలో అర్థంకాని జగ్గారావు కొంత సేపటికి—కూడ గట్టుకున్న ధైర్యంతో గొంతు సవరించుకొని, సభకు నమస్కారమని చేతులెత్తి మొక్కుతూ--

"మాకు భూమీ పుట్టా యేమీలేదు. మా పుట్టినూరు 'బొమ్మాలి' అక్కడ మాతల్లిదండ్రులు కూలీ నాలీ జేసి నన్ను చదివించారు. నా తోడబుట్టిన ఇద్దరన్నదమ్ములూ పాలేరికం జేసుకుతుబతున్నారు. ఒకచెల్లెల్ని మామేనత్త కొడుక్కిచ్చి పెళ్లిచేసాము. తల్లిదండ్రీ శ్రమతోటి చదూకున్న నాకు, మా మావ పోలీసుడిపార్ట్ మెంట్ లో పన్జేసేవోడు-ఆయన పుణ్యాన యీ ఉద్యోగం వచ్చింది...."

"ఈ సోదంతా యెందుకు....నేరారోపణ మీద సెప్పవయ్యా...." జనంలోంచి ఎవరో విసుగ్గా కేకవేసారు.

"ఎక్కడలేని నంగనాచి గుణమూ యిప్పుడొచ్చిందిరా, ఈడికి...." యింకెవరో విసుర్లు....

ఇలా గుసగుసలు, రణగొణ ధ్వనులు రాసాగాయి.

వెంటనే మేస్టారు లేచి, నిశ్శబ్దం అని కేకేస్తూ—

"కామ్రేడ్స్ ! అసహనం పనికిరాదు. అది కమ్యూనిస్టుల లక్షణం కాదు. పోలీసుకి తగిన స్వేచ్ఛ ఇవ్వాలి. తనపైన వచ్చిన ఆరోపణల మీద ఆయన చెప్పదలచుకున్నదీ, చెప్పేదీ అంతా మనం వినాలి. దాన్ని పరిశీలించాలి. నిజానిజాలు గ్రహించాలి. పక్షపాతంగా యేమాత్రమూ వుండకూడదు. ఇది ప్రజాకోర్టు ! బూర్జువా కోర్టులకీ, మనకోర్టులకీ

తేడా అన్ని విషయాలలోనా కనపడాల ! దయచేసి సాంతం వినండి...."
అని పరోసాగి విజ్ఞప్తిచేసి కూర్చున్నారు.

ఎక్కడి గుస గుస అక్కడే సద్దు మణిగింది. అంతా జవానునే చూస్తూ కూర్చున్నారు.

జవాను మళ్లీ ప్రారంభించాడు.

"నాకు ఉద్యోగమిప్పించటమే గాక, మా మాఁవ తన కూతుర్ని ఇచ్చి పెళ్లిచేసాడు. ఉద్యోగపు మొదటి రోజుల్ల నా కుటుంబాన్నీ, నా తల్లిదండ్రుల్నీ పోషించుకొచ్చీవోడ్ని. రాను, రాను ఇంట్లో బాధలు పెరిగాయి. పిల్లలు పుట్టారు. మా ఆవిడ మనసులో మా తల్లీ దండ్రీ మీద ద్వేషం పుట్టింది. నా మనసులో పోలీసు జాతి గుణమూ పుట్టి పెరిగింది.

ఇకక్కడికొంచి, అందరిలాగే మారిపోయేను. అందినకాడికి కొట్టుకొచ్చీవోడ్ని. అందల నాకు మిగిలిందేటిలే . మీకు తెల్దేటి ? మా జీతమేపాటిది ? పిల్లలు....కుటుంబం పెద్దది ! అగి గాక, మా మీద ఆపీసర్ల ఆర్డర్లెలాటివో మీరెరుగుదురు. మొత్తమ్మీద ఎవరి ప్రోద్బలమో ఎవరి ప్రోత్సాహమో అని చెప్పటం కోసం గాదు ఇదంతా చెప్తున్నది. నేనెలాగనేరాలు చేయటం జరిగిందో చెప్పాలనే యిది చెప్పాను. ఏమయినా నేను చేయరాని నేరాలే చేసాను. ఆరోపణ పత్రంలో వున్నదంతా వాస్తవమే. అందులో యేమీ అబద్ధం లేదు.

నాకు యింతదాక మాటలాడే అవకాశం వుంటాదని అనుకోలేదు. ఆ అవకాశం యివ్వకుండానే శిక్ష వేస్తారనుకున్నాను. గానీ, మీరంతా గొప్పగా ఆలోచిస్తున్నారు. గొప్ప న్యాయమైన రీతిల నడుస్తున్నారు.

అందుకనే మీ ముందు యీ మాటలు పలక గలగకన్నాను. నాకు మీరే శిక్ష, వేసినా అనుభవిస్తాను ! కానీ, నా కుటుంబాన్నీ, ముసిలి తల్లీ దండ్రుల్నీ అనాథలు జేయొద్దని కోరుతన్నాను,"

ఒళ్లంతా చెమటలు ధారాపాతంగా కారుతోంటే, మనసులోని భావోద్వేగం యింతసేపు మాట్లాడించింది జగ్గారావుని !

అప్పుడు, మళ్లీ మేస్టారులేచి, జనంవైపుచూసి—

"కామ్రేడ్స్ ! ఆరోపణ పత్రంలోనే గాక, అదనంగా యింకేమన్నా ఆరోపణలు వున్నా, జగ్గారావు సంజాయిషీ మీద యేమన్నా మాట్లాడాలనుకున్నా....ఒక్కొక్కరూ వచ్చి మాట్లాడండి" అని ఆహ్వానించారు.

జనంలో గొంతుకూర్చుని వున్న, సన్నగా పొడుగ్గా వున్న ఆరిక తట్టడు లేచి, ముందుకొచ్చి—

"పోలీసోడిని నమ్మగూడదు. ఈలకి దయా, దర్మాలుండవు. ఒకపాలి కర్రలకావిడి అమ్ముకుందుమని యీళ్ల పేటెల్లాను. సరిగ్గా ఈల టేసిన్ కాడి కొచ్చేసరికి, నా కర్రల కావిడి నాక్కున్నారీలు ఓలమ్మ ! ఇదేటి బావ్ ? యీగోరం ! బియ్యం గింజలు నేవని, కర్రలమ్ము కోడం కొచ్చాను. కావిడి నాక్కొని నా కడుపు కొట్టకండి – అనేంతబతిమాల్నానో ! ఒక్కడూ కనికరించలేదు. మనిసొక మాటాడి. లాఠీల్తోటి నా వీపిరేగ్గొట్టేసినారు. అందికనీ, పోలీసోడ్ని కనికరించ గూడదు...." అని చెప్పి జనంలో కలిసాడు.

ఆడవాళ్ల మధ్యలోంచి, నడివయసున్న కొమలమ్మ లేచి అక్కడ్నుండే మాట్లాడబోయింది !

జనం వేదిక ముందుకి వెళ్లి మాట్లాడమని కేకేసారు.

కొమలమ్మ సిగ్గుతో, చిర్నవ్వుతూ—

"ఇక్కడైతేనే సెప్తాను లేకపోతే కూకుండి పోతాను" అంది.

"సరే ! అక్కడ్నుండే చెప్పు కామ్రేడ్" అన్నారు మేస్టారు

"ఈ పోలీసుజాతి దుంపనాశనమవ్వాల ! ఈ గండలేగదా, అప్పుడు మందకి మంద యెలిపోవొచ్చి మన కొంపలు బుగ్గి జేస్సారు మా ఆడ

కూతుళ్ళ మానపేనాలు తీస్నారు. నా సెల్లెలు గేపకమొత్తే! నా కళ్ళంట రత్తం పడతాంది...." అని మరి మాట్లాడలేక, యేడుస్తూ కూర్చుండిపోయింది.

కోమలమ్మ చెల్లెలు రాజమ్మ! రాజమ్మకి పక్కవూరి సోమ్ములో పెళ్ళయ్యింది. ఆరోజు పోలీసులు దాడిచేసి, సర్వనాశనం చేసారు. ఆరోజు వారిద్దరికీ శోభనంసరిగ్గా, ఆరోజున పోలీసులు దాడిచేసి, సర్వనాశనం చేసారు. ఆదుర్ఘటనలో రాజమ్మ మాన ప్రాణాలు కోల్పోయింది!

ప్రజాకోర్టు ఒక్కసారి ఆవేశమైంది.

కోర్టులో మళ్ళీ కలకలం చెలరేగింది. మనిషోమాట తలా ఓ ఘటన చెప్పుకోసాగారు. ఎవరో—జోహార్ అమరవీరులకు! అంటే, కోర్టంతా జోహార్లర్పించింది, రైతాంగ పోరాటాలపై పోలీసుల దమనకాండ – అని ఎవరో అంటే నశించాలి! అని కొండ కొండా ప్రతిధ్వనించింది!

ఈ వాతావరణంలో గొయితాడ గ్రామరక్షకదళ కమేండరు సుక్కలేచి, వేదిక వద్దకు వచ్చి—

"యీ వొలిసల్ల, యిప్పుడు మన సంగబలం పెరిగింది. మన బతుకుల మీదకి యింతక ముందునాగ ఎవుల్నిండీ పెమాదం లేకండా జేగర్త పడుతున్నాం. ఇలాపింటపుడు, యీ పోలీసోడు వొచ్చాడు. ఈడు మామూలు కోసమొచ్చాడో, మరే అంతకం సెయ్యడాంకి వచ్చాడో ఎవులికి తెల్సు? యెందుకొచ్చినా, అది సిన్న యిసయం కాదు. ఇప్పుడు మించిపోనాది పరిస్థితి అని గుడ్లు తేలేస్సి, నానే పాపం ఎరగనంతన్నాడు గుడ్డి కొంగ నాగ! ఇసప్పురుగుని ఇడిసి పెట్టగూడదు. ఈడ్ని, ఈడి దురుమార్గాలకి శిచ్చగా యీ కోర్టుముందు సంపాల!" అని ప్రకటించి, జనం వైపు చూస్తూ జనంలో కూర్చున్నాడు.

జనంలోంచి "అవును, అవును....చంపాల! ..." కేకలు!

జగ్గారావు జనానికి సుక్కా ప్రకటనతో, జనం కేకల్తో పై ప్రాణాలు పైనే పోయాయి! అడివినీ, కొండనీ చూసాడు. ఆకాశాన్ని, భూమినీ చూసాడు. గుర్తొచ్చిన దేవుళ్ళనీ, దేవతలనీ తల్చుకుని, మొక్కులు మొక్కుకున్నాడు రక్షించమని! న్యాయమూర్తివైపు దీనంగా చూస్తూ, తడారిపోయిన గొంతుకతో ప్రజలందరికీ చేతులెత్తి మొక్కుతా —

"లేదు, నాయనలారా — లేదు నా దుర్మార్గాన్ని, నా జాతి దుర్మార్గాన్ని క్షమించ గూడదు నిజమే, కాదన్ను. అంతటి పాపాలే చేసాము.

కాని, మీరు ఉన్నతమైన ఆలోచన గలవాళ్లు. నా పరిస్థితీ, నా కుటుంబ పరిస్థితీ ఆలోచించమంటున్నాను. మీరంతా నా తల్లిదండ్రి లాంటోళ్లు. నా తల్లి, దండ్రీ తమ బతుక్కి యెంత బరువ చేసారో, యెన్ని బాధలు పడ్డారో నెవెరుగుదును. యిప్పుడికీ ఆ బాధలుపోలేదు. మాతోటే వున్నాయి. మీరు బాధలు పోడానికే యుద్ధంచేస్తున్రు. మీ యుద్ధం నాకూ, నా తల్లిదండ్రులకూ లాభమే గాని నష్టం కాదు. ఇకబట్టి — ఈ నేలతల్లి ఈ అడివితల్లిసాక్షిగా చెప్తున్నాను. నీనెలాటి దుర్మార్గప్పని చెయ్యను. చెయ్యను గాక చెయ్యను. మనిసిగా యికబట్టి బతుకుతాను. నన్ను కనికరించండి, నాపిల్లా జెల్లా కుటుంబాన్ని అనాధలు జేసేకండి..." అని యేడుస్తూ మొత్తుకొన్నాడు.

జగ్గారావు సంజాయిషీ, అతని వేడుకోలూ, ఆవేదనా కోర్టులో చర్చనీయాంశమైంది. కొందరు -

అంతా నాటకం పోలీసోడి టక్కుల్ని లెక్క చెయ్యొద్దు. ఈడ్నిప్పుడొదిలేస్తే, తన బలగం బలగాన్నంతేసుకొచ్చి వాలసల మీద పడతాడు. ఈడ్ని ఒదలకూడదు — అంటున్నారు. మరికొంతమంది -

నిజంగానే పోలీసోడు మారిపోనాడు. తనని తానే అసహ్యించుకుంటున్నాడు. తప్పుల్ని ఒప్పుకుంటున్నాడు. — అనీ అంటున్నారు.

కోర్టు ముందుకొచ్చి, ఇలా తమ అభిప్రాయాల్ని విన్పించారు గూడా వాళ్లంతా ! అయితే యేదీ ఖచ్చితంగా తేలలేదు. పోలీసుని – శిక్షించాలా ? వొదిలేయాలా ? – అనే చర్చతో కోలాహలంగా వుంది కోర్టు !

న్యాయమూర్తిగా అందరి అభిప్రాయాలా, ముద్దాయి సంజాయిషీ విన్నాక, మేష్టారు నిల్చొని, శాంత గంభీర స్వరంతో –

"కామ్రేడ్స్ ! జవాను సంజాయిషీ, మీ ఫిర్యాదులూ, వక్తల అభిప్రాయాలా విన్నాక ఒక విషయం అర్థమవుతోంది. ఈ ఫిర్యాదుల్లో అధికభాగము పోలీసువర్గాలు చేసిన దురంతాలే తప్ప, ఈ జగ్గారావు వొక్కడూ చేసినవి కావు. అయితే, నది ఎంత స్వచ్ఛమయిన దయినా మహాసముద్రంలో కలిస్తే ఉప్పనయి తీరుతుంది. అలాగే, జగ్గారావు దురంతాలు చేసి వుంటాడు.

శాస్త్రీయంగా ఆలోచించే మనం - ఎవరు యే పని చేసినా వారు ఆ పని ఎందుకు చేస్తున్నారో పరిశీలిస్తాం ! దోపిడీ పాలకవర్గాలకు యిట్లాంటి పోలీసులు కాళ్లూ, చేతులు ! నిరంకుశ అధికార్ల చేతుల్లో వీరు ఆటబొంతులు ! అయితే, వీరు మన పేదవర్గానికి చెందిన వారన్నది గుర్తులో వుంచుకోవాలి మనం !

"తెలిసో, తెలియకో, బ్రతుకు తెరువు పేరనో ఇలాంటివారు తప్పులు చేస్తే, వాట్ని వారిదృష్టికి తెచ్చి సరిదిద్దుకోమని చెప్తాము. ఆరకంగా మంచికి మారేందుకు అవకాశమివ్వాలి. యేమంటే, వీరూ పేదవారే గనక !" అని మాష్టారు తన అభిప్రాయాన్ని చెప్పారు.

మేష్టారి అభిప్రాయం అందరిలో చర్చనీయాంశమైంది. చాలా మందికి – నిజమే, గురువు సెప్పింది ఆలోసించాల. పాపం, పోలీసోడు పిల్లలు గలోడు-పేదోడు. ఇలా సానుభూతి ప్రజాకోర్టులో కలిగింది. కొంత మంది - అలాగెలా వీలవుద్ది ? ఊరకుక్క- బుద్ధి మారతాదా ? తేలు కుట్టడం మానతాదా ? - అనే వాదం గూడా చేసారు.

ఒక కామ్రేడ్ లేచి, –

“నిజమే, మేష్టారు చెప్పినట్లు మనం ఆలోచించాల. కానీ, ఈ పోలీసు తన తప్పులు దిద్దుకుంటాడనే ఆలోచన ఒక వ్యక్తి పరంగా అయితే సర్లే కావచ్చు అని అనుకోవచ్చు. కానీ, మూకలో ఒకడుగా కాకిలా పొడుచుకు తినడం, మందలో ఒకడుగా ఎద్దులా కుమ్మడం మానుతాడా ? తామూ ‘పేదవర్గం’ వాళ్ళమే అనే చైతన్యం వచ్చి, తమ స్వవర్గజనంతో వీరు కలవటమనేది ఇప్పుడు కలలోగూడా ఆలోచించలేం! అంచేత, పేదవాడనే ఆలోచనతో, పోలీసు స్వభావాన్ని క్షమార్హంగా ఆలోచించొద్దని నావిజ్ఞప్తి” అన్నాడు.

ఈ విజ్ఞప్తితో – నిజమే, పోలీసోడి గుణం పోద్దా ! అనే ప్రశ్నార్థక భావాలు కొందరిలో కలిగాయి. ఈ ప్రశ్నలకు సానుభూతి భావాలు కల్గిన కొందరు సమాధానాలు చెప్పారు. ఒకరుగా కోర్టుముందు నిల్చొని తమ అభిప్రాయాలు చెప్పారు. ఎక్కువమంది క్షమాభిక్ష పెట్టొచ్చు అన్నట్లుగానే మాట్లాడారు. కొద్దిమందే పోలీసుగుణం మారదనీ, ఆతన్ని విడిచిపెడితే నష్టపెడతాడనీ - మాట్లాడారు.చివరికి మాష్టారు లేచి–

“పేద పోలీసు...మన శత్రువర్గం కాదు. ఒక రకంగా వారికీ మనకూ ఉమ్మడి శత్రువు దోపిడీ వర్గాలు. ఉమ్మడి శత్రువు మీద పోరాటం చేస్తున్న మనకు మన కష్టనష్టాలు వుంటాయి. అయితే ఈ జగ్గారావుని విడిచి పెట్టినంత మాత్రాన అదనంగా వచ్చే కష్ట నష్టాలేమీ వుండవు. నిరంకుశ పోలీసు శక్తుల వలయంలోనే మనం ఉద్యమాన్ని రక్షించుకుంటున్నాం కాదా యీనాడు !

అందుకనీ, పేదవర్గానికి చెందీ, నికృష్ట జీవనం సాగిస్తోన్న ఈ [redacted] జవానుకి ప్రాణభిక్షపెట్టి, మంచిగా మారే అవకాశం ఇద్దాము. ప్రజల బాధల్ని, పోరాటాల్ని అర్థంచేసుకొనే అవకాశం ఇద్దాము. మంచి మార్గానికి మారి, ప్రజలకు మిత్రుడిగా వున్నాడా సరే: లేదంటే

గతతరహా జీవితాన్నే కొనసాగిస్తే, మనగెరిల్లాల కత్తులకు, మన పోరాటాగ్ని జ్వాలలకు ఎప్పుడో ఒకప్పుడు బలికాక తప్పదు. ఏమంటారు?" అని సుదీర్ఘంగా వివరించి, ప్రశ్నించారు.

కోర్టు అంతా మౌనం దాల్చింది. దాదాపు యావత్తు ప్రజానీకం మేష్టారి అభిప్రాయాన్ని అంగీకరించారు.

అప్పుడు, మేష్టార్ని ప్రజాకోర్టు నిర్వహించాల్సిందిగా ఆహ్వానించిన కామ్రేడే లేచి వచ్చి—

"ప్రియతమ ప్రజలారా! మేష్టారు చెప్పిన అంశాలు, వాద ప్రతివాదనలు విన్నారు కదా! ఉన్నత లక్ష్యానికి అంకితమయిన మనం ఆ ఉన్నత భావంతోనే ఆలోచించి; ఇప్పటికి జగ్గారావుని క్షమించి విడిచి పెట్టడం మంచిదిగా భావిస్తున్నాను. మీకు అంగీకారమైతే చప్పట్లద్వారా ఆమోదాన్ని తెల్పకోరుతున్నాను. అంతేగాక; ఎవరికైనా ఇంకా అభ్యంతర ముంటే యీ వేదిక వద్దకు వచ్చి తెలపగోర్తున్నాను" అని చెప్పారు.

జనంలోంచి ఆమోదం చప్పట్ల మోతల్తో ధ్వనించింది. అంతా జగ్గారావుని సానుభూతిగా చూడసాగారు.

జగ్గారావు చచ్చి బతికి నట్లయింది. పాత పోలీసు జీవితం అంతా చచ్చిపోయింది. ఇప్పుడు జనం ముందున్న జగ్గారావు కొత్తవ్యక్తి! ఆ వ్యక్తిని పూర్వంలా ఖాకీ గుడ్డలు గుండెల్నీ, గుండెలోని కరుణనీ, మానవత్వాన్ని కప్పివేయలేవు! లాఠీ, బూటులు దర్పం చూపలేవు. నోరూ, నాలుకా బూతులు పలుకలేవు! మొత్తం జగ్గారావు రూపం, భావం మార్పయ్యింది.

జల, జలా కన్నీటిబొట్లు రాలుస్తూ, అందరివైపూ [illegible]భావనగా చూస్తూ—

"నన్ను క్షమించిన మీ గొప్పతనం, మీ ఉన్నత ఆదర్శం తెల్సి

కున్నాను. మీరు గెలుస్తారు. ప్రజలు గెలుస్తారు. ప్రజాపోరాటం వర్ధిల్లు తుంది....” అన్నాడు ఆవేశంగా పిడికిలెత్తి!

ఈ మహత్తర ఉద్యమానికి తన నిధిగా జవాను తన జేబులోవున్న ఇరవైనాల్గు రూపాయలూ ప్రజాకోర్టుకి సమర్పించు కున్నాడు.

జనంలోంచి ఎవరో—ప్రజాకోర్టు—వర్ధిల్లాలి !, సంఘం....వర్ధిల్లాలి !, సాయుధ పోరాటం....వర్ధిల్లాలి !—అని అరిచారు.

ప్రతిగా జనం గొంతులన్నీ నినదించాయి !

వాటితో పాటుగా జగ్గారావు గొంతూ అసంకల్పితంగానే వంత పలికింది !

బదులుగా కొండ, కొండా ప్రతిధ్వనించింది !

★